

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుల్లోని సభ్యులకు రాయితీపై ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందజేస్తోంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కూడా బియ్యం కార్డు ప్రామాణికంగా మారింది. అలాంటి ముఖ్యమైన కార్డుల్లో సభ్యులుగా ఉన్న 74,955 మంది ఈకేవైసీకి దూరంగా ఉన్నారు. వీరు ఎక్కడున్నారు.. అసలు ఉన్నారా.. లేరో కూడా తెలియడం లేదు.

- చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి

74,955 మంది ఎక్కడ..?

● రేషన్‌కార్డులో సభ్యులుగా ఉంటూ ఈకేవైసీ చేయించుకోలేదు

బియ్యం కార్డులోని వారంతా ఈకేవైసీ చేయించుకుంటేనే రాయితీపై నిత్యావసర సరుకులు అందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మూడు నెలల కిందటే ఈకేవైసీ గడువు ముగించబోతున్నట్లు హెచ్చరించింది. అయితే పేదలకు ఇబ్బంది కలుగకూడదని ఈ ప్రక్రియను కొనసాగిస్తోంది. ప్రతినెలా 8 నుంచి 12 శాతం మంది కార్డుదారులు నిత్యావసర సరుకులు తీసుకోవడం లేదు. అలాంటి వారంతా స్థానికంగా ఉండడం లేదని భావిస్తున్నారు. అలాగే కొన్ని బోగస్ కార్డులు చెలామణిలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

మినహాయింపు వీరికే..

0-5 ఏళ్ళ లోపు చిన్నారులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈకేవైసీ నుంచి మినహాయించారు.

సంఖ్యగా..

- రేషన్ కార్డుల్లోని సభ్యులు : 16,94,463
- ఈకేవైసీ పూర్తయినవారు : 15,71,016
- ఐదేళ్లలోపు చిన్నారులు : 47,747 మంది
- 80 ఏళ్లు పైబడిన వృద్ధులు : 745 మంది
- ఈకేవైసీ చేయించుకోనివారు : 74,955 మంది

ఈకేవైసీ తప్పనిసరి

భవిష్యత్తులో రేషన్ సరుకులు తీసుకోవడానికి ఈకేవైసీ తప్పనిసరి. పెండింగ్‌లో ఉన్న వారందరికీ ఈకేవైసీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నెలల తరబడి సరుకులు తీసుకోనివారితోపాటు ఈకేవైసీ ప్రక్రియ పూర్తికాని కార్డుదారుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

- ఎస్.శంకరన్, జిల్లా పౌరసరఫరాల అధికారి

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలన్నారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ.. : జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ తుషార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకోవాలని సూచించారు.

వరసిద్ధుడి దర్శనానికి 3 గంటలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలకుపైగా సమయం పట్టింది. ఆదివారం సెలవు కావడంతో జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేశారు. క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి. దీంతో ప్రతి భక్తుడికి స్వామి దర్శన కల్పించడానికి ఈవో పెంచలకిషోర్ క్యూలైన్లను దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.

CTBTA DATE 03-11-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION

టుడే సప్లై రేట్ 130/-	డ్రెస్సిడ్ స్కిన్‌తో 234/-
రిటైల్ లైవ్ బర్డ్ 155/-	స్కిన్‌లెస్ 259/-

ఆలయం వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



నేడు డయల్ యువర్ సీఎండీ

చిత్తూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందుకోసం వినియోగదారులు 89777 16661 నెంబరుకు ఫోన్‌చేసి లేదా 91333 31912 నెంబరుకు వాట్సాప్ ద్వారా కూడా సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

సారీ డాడీ చనిపోతున్నా..!

ఆ పిల్ల నన్ను నమ్మించి.. మోసం చేసింది

లేఖ రాసి యువకుడి ఆత్మహత్య



అరవింద్ (ఫైల్‌ఫొటో)

పెనుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'సారీ డాడీ చనిపోతున్నా.. ఆ పిల్ల నన్ను మోసం చేసింది.' అంటూ లేఖ రాసి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుమూరు మండలంలోని విడిదిపల్లెకు చెందిన డి.రమేష్ రెండో కుమారుడు అరవింద్(17) పెనుమూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న 18 ఏళ్ల అమ్మాయిని ప్రేమించాడు. ఇద్దరూ కలిసి గతనెల 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. ఈ క్రమంలో అరవింద్ కనిపించడం లేదని పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తు చేయగా విజయవాడ సమీపంలో గన్నవరం మండలంలో వీరిద్దరూ ఉన్నారని పోలీసులు గుర్తించారు. అక్టోబరు 29వ తేదీన కుటుంబీకులతో కలిసి పోలీసులు అక్కడికెళ్లి వారిద్దరినీ తీసుకొచ్చి నచ్చజెప్పారు. అరవింద్ మైనర్ కావడంతో అమ్మాయిని వారి తల్లిదండ్రుల వెంటపంపారు. ఈ నేపథ్యంలో అరవింద్ విడిదిపల్లెలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఆదివారం ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి పెనుమూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విచారణలో అరవింద్ రాసిన లేఖ బయటపడింది. అందులో 'అమ్మా.. నాన్నా సారీ మిమ్మల్ని వదిలి వెళ్లిపోతున్నా. నన్ను క్షమించండి. నాకు బతకాలని లేదు. నావల్ల నువ్వు చాలా బాధ పడ్డావ్ సారీ డాడీ, ఆ పిల్ల నన్ను చాలా నమ్మించింది. నాతోనే ఉంటానని చెప్పి నన్ను మోసం చేసింది. మీ కోసం బతకాలని ఉంది. కానీ నా వల్ల కావడం లేదు.. సారీ డాడీ అందరినీ వదిలి వెళ్లిపోతున్నా' అని ఉందని పోలీసులు తెలిపారు.

హుషార్

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగ విజయంతో అంబరాన్నంటిన సంబరాలు



ఆదివారం సాయంత్రం 5.26 గంటలు. శనివారం సాయంత్రం మొదలైన కౌంట్ డౌన్ '0'కు చేరింది. అంతే.. ఒక్కసారిగా నిప్పులు చిమ్ముతూ భారీ ఉపగ్రహాన్ని తీసుకుని బాహుబలి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. కోట్లాది మంది భారతీయుల కలలను సాకారం చేస్తూ.. శాస్త్రవేత్తల శ్రమకు ప్రతిఫలమిస్తూ సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. దీంతో ఒక్కసారిగా షార్‌లో చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దేశమంతా సంబరం చేసుకుంది. దీనికి సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) వేదికైంది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్వీఎం3-ఎం5 రాకెట్.. 4,410 కిలోల అతి పెద్దదైన సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ రోదసిలోకి వెళ్లింది. మూడు దశలను విజయవంతంగా పర్తి చేసుకుని నిర్ణీత 16.29 నిమిషాల్లో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటించడంతో సంబరాలు మిన్నంటాయి.తొలి ప్రయత్నంలోనే భారీ ప్రయోగం విజయవంతం కావడంతో దేశమంతా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు గ్యాలరీకి మధ్యాహ్నమే భారీగా సందర్శకులు చేరుకున్నారు. ఆదివారం కావవడంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా విచ్చేశారు. రాకెట్ నింగిలోకి ఎగిరే సమయంలో గ్యాలరీలో ఉన్న వీక్షకులు చప్పట్లు, కేరింతలు కొడుతూ ఉత్సాహంతో తిలకించారు.



వీక్షిస్తున్న ఇస్రో ఛైర్మన్, శాస్త్రవేత్తలు

ఎల్వీఎం3 వరుస విజయాలు..

బరువైన ఉపగ్రహాలను నింగిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఎల్వీఎం3 రాకెట్లను రూపొందించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్రయోజనిక్ దశను సైతం అభివృద్ధి చేసి విజయవంతంగా ప్రయోగించారు.

- 2010లో ఎల్వీఎం3 రాకెట్లకు పునాది వేయగా తొలిసారిగా 2014 డిసెంబరు 18న ఎల్వీఎం3 కేర్ మిషన్‌ను ప్రయోగించి తొలి ప్రయత్నంలో విజయం సాధించారు.అప్పటి నుంచి భారీ ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా పంపేందుకు శ్రీకారం చుట్టారు.
- 2017 జూన్ 5న ఎల్వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 ఉపగ్రహాన్ని విజయవంతం పంపారు. అప్పట్నుంచి భారీ ఉపగ్రహాలను విజయవంతంగా మోసుకెళ్లే ఈ రాకెట్.. బాహుబలిగా పేరొందింది.
- 2018 నవంబరు 14న జీశాట్-29, 2019 జూలై 22న ఎల్వీఎం3-ఎం1ద్వారా చంద్రయాన్-2, 2022 అక్టోబరు 22 ఎల్వీఎం3-ఎం2 వన్‌వెబ్-1,2023 మార్చి 23ఎల్వీఎం3-ఎం3 ద్వారా వన్‌వెబ్-2,, 2023 జూలై 14 ఎల్వీఎం3-ఎం4 ద్వారా చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి చరిత్ర సృష్టించారు.
- తాజాగా ఎనిమిదో ప్రయోగం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ రంగానికి చెందిన సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో చరిత్రలో మరో కలికితురాయిగా నిలిచింది. వరుసగా 8 ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు సత్తా చాటారు.

గ్యాలరీలో నుంచి రాకెట్ ప్రయోగాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న వీక్షకులు



కోటపల్లెలో గజదాడులు

కల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల మంద దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పగలంతా అడవిలో తిష్ఠ వేస్తున్న ఏనుగులు రాత్రి వేళల్లో పొలాలపైపడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఏళ్ల కిందట నాటిన మామిడిచెట్లను విరిచేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. శనివారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి బయల్దేరిన 16 ఏనుగులు మంద అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ కోటపల్లె సమీపానికి చేరుకున్నాయి. నరసింహులుకు చెందిన మామిడితోటలో సుమారు 60 చెట్ల కొమ్మలను విరిచేశాయి. అలాగే రఘు, దామోదర్‌నాయుడు, వెంకట్రామయ్య, మురళికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడినుంచి వచ్చిన మార్గంలోనే తిరుగుముఖం పట్టాయి. ఆదివారం ఉదయం పొలం వద్దకు చేరుకున్న నరసింహులు దంపతులు విరిగిన మామిడిచెట్లను చూసి కన్నీరు పెట్టుకున్నారు. 20 ఏళ్లుగా కన్నబిడ్డల్లా పెంచుకుంటున్న మామిడిచెట్లను రాత్రికి రాత్రే ఏనుగులు ధ్వంసం చేశాయని వాపోయారు. ధ్వంసమైన మామిడి చెట్లను ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు పరిశీలించారు.





ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన మామిడిచెట్లు

'కడా'కు త్వరలో ఏపీడీ

రామకుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా డెవలప్‌మెంటు అథారిటీ(కడా)కు త్వరలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ) నియమితులు కానున్నారని పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం ఆనిగానూరులో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశంలో పలువురు అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ ఎయిర్‌పోర్టు, పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణలో కుప్పం ఆర్డీవో ఉన్నారని.. వైసీపీ పాలనలో చేసిన రీసర్వేతోపాటు వారి అక్రమాలకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడటంతో కుప్పం నియోజకవర్గంలో ఎక్కడా లేనన్ని సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కడాకు ఏపీడీని నియమించాలని కోరామన్నారు. స్పందించిన సీఎం.. త్వరలోనే ఏపీడీ నియామకం చేపడతానని చెప్పారన్నారు. ఏపీడీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి



● మాడవీధుల్లో ఊరేగిన ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వైభవంగా జరిగింది. వేకువజామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు బంగారు వాకిలి చెంత అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని నిర్వహించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగుతారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ వాహనసేవలో పాల్గొన్నారు. భక్తులందరికీ స్వామి కృపాకటాక్షాలు కలగాలని ప్రార్థించినట్టు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు.

నేడు ఇన్‌చార్జి మంత్రి రాక

చిత్తూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం చిత్తూరుకు రానున్నారు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన డిస్పెన్సరీని మంత్రితో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించనున్నారని ఆర్టీసీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


హరిబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు

పెద్దపంజాణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపంజాణి మండలంలోని రైతు హరిబాబు(36) ఆదివారం ఉదయం తన పొలంలోని బోరుమోటారును ఆన్ చేయడానికి వెళ్లాడు. కొద్దిరోజులుగా వర్షం కారణంగా మోటారు ఆన్ చేయకపోవడంతో అక్కడున్న వైర్లు తెగి స్టార్టర్ బాక్స్‌పై పడి ఉండటాన్ని గమనించలేదు. స్టార్టర్ ఆన్ చేయడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు వైద్యశాలకు తరలించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య..?


లావణ్య మృతదేహం

పెద్దపంజాణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపంజాణి మండలంలోని చల్లావారిపల్లెకు చెందిన చెంగ్రాయప్ప కుమార్తె లావణ్య(17) పలమనేరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆదివారం గ్రామ సమీపంలోని మునీశ్వర స్వామి గుట్టపై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే తమ బిడ్డ మృతికి మారపల్లె గ్రామానికి చెందిన ఎంబీఏ విద్యార్థి కారణమని లావణ్య తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు వైద్యశాలకు తరలించారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్' మినహాయించాలి

- పీఆర్‌టీయూ



సమావేశంలో ప్రసంగిస్తున్న కన్నన్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కేఎన్ కన్నన్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు ప్రసంగించారు. ఇప్పటికే పనిచేస్తున్న టీచర్లు టెట్ రాయాలని నిర్బంధం చేస్తున్న క్రమంలో విద్యాహక్కు చట్టం 2009ని సవరించాలని కోరారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలు, ఏకీకృత సర్వీసు రూల్స్‌కు సంబంధించి కోర్టు కేసులు పరిష్కరించి, డీఈవో, డీవైఈవో, ఎస్‌సీఈఆర్‌టీ, డైట్, జూనియర్ లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. డీవైఈవో పోస్టు ఎఫ్ఏసీ ఇచ్చే సందర్భంలో జడ్పీ హెచ్ఎంలను పరిగణనలోకి తీసుకోవాలని, పెండింగ్ పీఆర్‌సీ, డీఏ అరియర్స్ బకాయిలు విడుదల చేయాలని, హైస్కూల్ ప్లస్‌కు సంబంధించి శాశ్వత పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో టీచర్లు పాల్గొన్నారు.

భారత మహిళల క్రికెట్ జట్టు గెలవాలని పూజలు



చిత్తూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారత మహిళల క్రికెట్ జట్టు గెలవాలని కోరుకుంటూ స్థానిక వినాయక స్వామి ఆలయంలో తెలుగు మహిళలు ఆదివారం పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టారు. చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు లీలావతి, ఉపాధ్యక్షురాలు దేవి తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం... వాయులింగేశ్వరుడి ఆలయం


రాహుకేతు పూజల కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులకుతోడు కార్తీక మాసం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

జ్ఞానప్రసూనాంబ సమే త శ్రీకాళహ స్తీశ్వ రాలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరిం చు కుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని సంప్రదాయబ ద్ధంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అధికారులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.2.98 కోట్లు లభించింది.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ




చౌడేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. వేకువజామునే అమ్మవారిని సుప్రభాతసేతో మేల్కొలిపి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. స్వర్ణాభరణాలు, పూలతో అలకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

చెరువుల్లో పడి ముగ్గురి మృతి




లక్ష్మమ్మ, మునస్వామి మృతదేహాలు, ఏకాంబరం (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, యాదమరి మండలాల్లోని చెరువుల్లో పడి ముగ్గురు మృతి చెందారు. వీరిలో.. యాచకురాలు, రైతు, మరో వ్యక్తి ఉన్నారు.

చౌడే పల్లె/యాదమరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలంలోని పెద్దకొండామారికి చెందిన నరంసింహులు భార్య లక్ష్మమ్మ(70) భర్త కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె బోయకొండలో యాచకురాలిగా జీవిస్తోంది. పిల్లలు కూడా లేకపోవటంతో ఒంటరిగా ఉంటోంది. ఈక్రమంలో గ్రామం సమీపంలో ఉన్న బొడుగుకుంట చెరువులో ఆదివారం ప్రమాదవశాత్తూ కాలుజారి పడటంతో మృతి చెందింది. విషయం తెలియడంతో గ్రామపెద్ద నాగభూషణరెడ్డి, సర్పంచ్ జయసూదనమ్మ ఆధ్వర్యంలో చెరువు సమీపంలోనే అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇదే మండలంలోని 29ఏ చింతమాకులపల్లెకు చెందిన మునస్వామి(65)శనివారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న చింతమాకులపల్లె చెరువులో చేపల కోసం వల ఏర్పాటు చేశాడు. ఆదివారం వేకువజామున చెరువు వద్దకెళ్లి వల తీస్తుండగా ప్రమాదవశాత్తూ అందులోపడి మృతి చెందాడు. ● యాదమరి మండలంలోని అత్తిగారిపల్లె పంచాయతీ ఎగువపాతపాళ్యం గ్రామానికి చెందిన రైతు ఏకాంబరం (55) గ్రామానికి సమీపంలో ఉన్న కూటలవంక చెరువు పరిసరాల్లో పొలాలను సాగుచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పొలానికి వెళ్లి రాత్రయినా ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం కుటుంబీకులు పొలం సమీపంలో గాలించగా, కూటలవంక చెరువుగట్టుపై ఆయన చెప్పులు కనిపించాయి. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి చెరువులో గాలించగా ఏకాంబరం మృతదేహం లభ్యమైంది. బహిర్భూమికెళ్లి చెరువులో పడి మృతి చెందినట్లు భావిస్తున్నారు. భార్య పెద్ద లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో యాదమరి పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాండ్ల కుల సంక్షేమమే ప్రధాన కర్తవ్యం

● అఖిల గాండ్ల, తెలికుల ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ


గాండ్లకుల సంఘ నేతలను సన్మానిస్తున్న జిల్లా నేతలు

చిత్తూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గాండ్ల కుల సంక్షేమమే తమ ప్రధాన కర్తవ్యమని అఖిల గాండ్ల, తెలికుల ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ తెలిపారు. ఆదివారం జడ్పీ సమావేశపు హాలులో జిల్లా సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస ఆత్మీయ అభినందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తెస్తే ప్రభుత్వంతో పోరాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే బగ్గడి గోపాల్, కుప్పం రెస్కో చైర్మన్ ప్రతాప్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమావతి ప్రసంగించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఐకమత్యంతో ఉంటే గాండ్ల కులస్తులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం టెన్త్, ఇంటర్మీడియట్‌తోపాటు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందిన వారిని సన్మానించారు. సంఘ గౌరవాధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు ఏఆర్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలమనేరు బాలాజి, రెస్కో డైరెక్టర్ తులసీనాథ్, కౌన్సిలర్ కోదండరామయ్య పాల్గొన్నారు.

గుడికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఒకరి మృతి, మరొకరికి గాయాలు


సాంబశివ (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. జీడీనెల్లూరు నియోజకవర్గానికి కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేటకు చెందిన సాంబశివ(48), మోహన్‌దాస్(42) టీవీ చానళ్ల రిపోర్టర్లుగా పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం స్వగ్రామం నుంచి బైక్‌లో ఇద్దరూ కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లారు. స్వామిని దర్శించుకుని రాత్రి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో కార్వేటినగరం మండలం బండ్రేవు గ్రామ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఇద్దరూ గాయపడటంతో చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాంబశివ(48) మృతి చెందాడు. ఇతను టీడీపీ కార్యకర్త కూడా. ఈ ప్రమాదంపై కార్వేటినగరం నగరం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. శవ పరీక్ష తర్వాత బంధువులకు మృతదేహాన్ని ఆదివారం అప్పగించారు. విషయం తెలియడంతో ప్రభుత్వ విప్ థామస్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. మోహన్ దాస్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విలువల్లేని విద్య నిష్ప్రయోజనం


పురస్కారాలు, బహుమతులు అందుకున్న కవులు, విద్యార్థులు

గంగవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విలువల్లేని విద్య నిష్ప్రయోజనం అని విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గొర్లపాటి దామోదరనాయుడు అన్నారు. ఆదివారం గంగవరం సాయిగార్డెన్ సిటీలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రతిఒక్కరూ తెలుగు చదవడంతో విలువలు అలవడుతాయన్నారు. నేటి సమాజంలో పిల్లలు సెల్‌ఫోన్లతో చెడిపోవడానికి తల్లిదండ్రులే కారణమవుతున్నారన్నారు. సెల్‌ఫోన్లు పక్కనపెట్టి విద్యార్థి దశ నుంచే పిల్లలకు నీతికథలు, నీతి పద్యాలు నేర్పించడంతో మంచి పౌరులుగా ఎదిగే అవకాశాలు ఉన్నాయన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితిని ఏర్పాటు చేసి 13 ఏళ్ల నుంచి తెలుగు భాషా పరిరక్షణకు నిర్విరామంగా కృషిచేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులైన తులసీనాథం నాయుడు, పుష్ప దంపతుల సేవలను కొనియాడారు. అనంతరం వందకుపైగా పద్యాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగుభాషకు నిస్వార్థంగా సేవలందిస్తున్న డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు (దామలచెరువు), జుంటూరు తులసీదాస్ (అనంతపురం), ముమ్మల తిరుపతిరావు (విజయనగరం), నెమిలేటి కిట్టన్న (తిరుపతి), యువశ్రీ మురళి (బీఎన్‌కండ్రిగ), డాక్టర్ మౌని (తిరుపతి), టి.యల్.నరసింహులు, వి.నారాయణ (పలమనేరు), ఒట్ర ప్రకాశ్‌రావు (తిరుత్తణి), అశ్వర్థనారాయణ (పుంగనూరు), పి.చిత్ర, నాగబాలాజి (గంగవరం)లకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శతావధాని ఆముదాల మురళి, పైనేని మురళి, సీతారామయ్య, లత, చాణక్య, దామోదరనాయుడు, నరేంద్ర, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడో డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

● అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం ఆటోనగర్ సమీపంలో నివాసమున్న ఓ బ్యూటీషియన్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ర్యాపిడో డ్రైవర్ జైలుపాలయ్యాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. ఆటోనగర్ సమీపంలో నివసిస్తున్న ఓ మహిళ ఇంటి వద్ద బ్యూటీషియన్ మాల్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి తిరుపతికి వచ్చిన ఆమె.. ఇంటికి వెళ్లడానికి ర్యాపిడో బుక్ చేసుకున్నారు. దీంతో ర్యాపిడో డ్రైవర్ పెద్దయ్య తిరుపతి నుంచి ఆమెను తీసుకుని ఇంటి వద్ద విడిచి పెట్టాడు. కొంతదూరం వెనక్కి వెళ్లిన తర్వాత ఆమె ర్యాపిడో బుక్ చేసిన నెంబరుకు ఫోనుచేసి అసభ్యంగా మాట్లాడాడు. మెసేజ్‌లు పెట్టాడు. వీడియో కాల్ చేయగా ఆమె తీయలేదు. ఆ తర్వాత ఇంటికెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న భర్త, పిల్లలు వచ్చి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. డయల్ 112కు సమాచారం ఇచ్చారు. అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ లోకేష్‌బాబు, సిబ్బంది ర్యాపిడో డ్రైవర్ పెద్దయ్యను అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన బాలోత్సవం



మట్టితో విభిన్న ఆకృతులతో బొమ్మలను ఆవిష్కరించారు. అబ్బురపరిచే దృశ్యాలను గీశారు. దేశభక్తి పాటలు పాడారు. వివిధ అంశాలపై ఉపన్యాసాలిచ్చారు. కోలాటాలాడారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. చెవులక ఇంపుగా శాస్త్రీయ సంగీతం వినిపించారు. జానపద గీతాలతో హుషారెత్తించారు. యోగా విన్యాసాలతో అబ్బురపరిచారు. ఇలా రెండు రోజులపాటు తిరుపతిలో సాగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. రెండో రోజున 18 అంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆరు సాంస్కృతిక వేదికల్లో నృత్యప్రదర్శనలు, జానపద కళాప్రదర్శలు జరిగాయి. ఈ రెండు రోజులపాటు విద్యార్థులు సరదాగా గడిపారు. కొన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు రాగా.. మరికొందరు తమ తల్లిదండ్రులతో కలిసి పోటీలను వీక్షిస్తూ ఆనందంగా గడిపారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి




రేపు అథ్లెటిక్స్, చెస్ జట్ల ఎంపిక పోటీలు

చిత్తూరు క్రీడలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని బాల బాలికలకు మదనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అథ్లెటిక్స్ చెస్ జట్ల ఎంపిక పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యానిర్వహక కార్యదర్శి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్ చెస్ అండర్-14, 17 బాలబాలికల జట్లకు పోటీలు జరుగుతాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

పుంగనూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని మేలుపట్ల పెట్రోల్ బంకు వద్ద ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చౌడేపల్లె మండలం కాటిపేరికి చెందిన గంగప్ప (60) సొంత పనులపై ద్విచక్రవాహనంపై పుంగనూరుకు వచ్చి తిరిగి ఇంటికి బయల్దేరాడు. చౌడేపల్లె వైపు నుంచి ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం తొలుత పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి ఆ తర్వాత మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

శవ రాజకీయాలు చేస్తున్న వైసీపీ

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శవ రాజకీయాలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆరోపించారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వరాలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మరణించడం దురదృష్టకరమన్నారు. ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, క్యూలైన్లను క్రమబద్ధీకరించిందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రెస్క్యూ టీం, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. ప్రమాదం జరిగిన గుడి పూర్తిగా ప్రైవేటు నిర్వహణలో ఉందన్నారు. పూర్తి విషయం తెలుసుకోకుండా ప్రభుత్వంపై వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం, విమర్శించడం తగదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మాజీ సీఎం జగన్, ఆ పార్టీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు.

శ్రీవారి ఆశీస్సులకోసం..



వివాహానంతరం శ్రీవారి ఆశీస్సులు పొందడానికి సినీ హీరో నారా రోహిత్, శిరీష దంపతులు తిరుమలకు వచ్చారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల రోహిత్ దంపతులను పలువురు అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

హెల్త్ కేర్
డా॥కె. కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatolory) పురిటి బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT -1777

WANTED
నవయుగ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో A.P.ఆగ్రోస్ ప్లాంట్ నందు ఆర్గానిక్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో మార్కెటింగ్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, వర్కర్స్, యువతీ, యువకులు మరియు 65 సం.లోపు రిటైర్డ్ ఉద్యోగులు కావలెను. Q: 10+2 పైన Age: 20-60 జీతం : 15 వేలు నుంచి 30 వేలు. A.P. ఆగ్రోస్, తిరుచానూరు మ్యాంగో ఫ్రూట్ మార్కెట్, తిరుపతి. www.navayuga.org, Cell : 93928 77588, 99662 11553.
AJT -1779

PLOTS FOR SALE
Investment Plots | Farm House Plots | Villa Plots for Sale : Lucky Ventures (India's No.1 Real Estate Company). Cell : 91145 61456
AJT - 1771

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246990

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



జనసేన జెండా ఆవిష్కరణలో పాల్గొన్న పసుపులేటి హరిప్రసాద్

గుడుపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గుండ్లసాగరం, యామిగానిపల్లె, కనమనపల్లె గ్రామాల్లో జనసేన పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదు సంవత్సర అరాచక పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమిలేదన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందుతోందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో రాజధాని అమరావతి దేశం గర్వించే స్థాయిలో రూపాంతరం చెందుతోందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి అభ్యర్థుల విజయానికి పాటు పడాలని కోరారు. మండలాధ్యక్షులు అమీర్, కుప్పం నియోజకవర్గ కన్వీనర్ నరేష్, వామనమూర్తి, మునెప్ప, పవన్, పాండు, చంద్ర, నాగరాజు, పాండు, అమలా జంషీర్, జాకీర్, జమీర్, వాజిత్, విజయ్ హంసగిరి, మణికంఠ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ కనబరిచిన పుంగనూరు విద్యార్థులు

పుంగనూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మైసూరు చాముండీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 28వ ఆల్ఇండియా షిటో-రేయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పుంగనూరు విద్యార్థులు విశేష ప్రతిభతో బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు మాస్టర్ ఎం.రెడ్డిమహేష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మైసూర్‌లో శని, ఆదివారాల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ కర్ణాటక చైర్మన్ సీఎస్.అరుణ్‌మచ్చయ్య ఆధ్వర్యంలో జరిగిన కరాటే పోటీల్లో పుంగనూరు మహేష్ మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన కె.పవిత్ర బంగారు పతకం, జి.శ్రేష్ఠ, ఎస్.జూహాఫాతిమాలు కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను కరాటే రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్ ఎకుమార్, కరాటే జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిమహేశ్ అభినందించారు.

టీమిండియా మహిళా క్రికెట్ జట్టు కోసం పూజలు



ఆలయం ఎదుట విజయ చిహ్నం చూపుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీమిండియా మహిళా క్రికెట్ విజయం కోసం కుప్పంలో ఆదివారం టీడీపీ నాయకులు, క్రీడాభిమానులు, తెలుగు మహిళలు, విద్యార్థులు పూజలు చేశారు. కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి ఆలయానికి చేరుకున్న క్రికెట్ అభిమానులు, టీమ్ ఇండియా మహిళా క్రికెట్ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో గెలిచేలా దీవించాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వేడుకున్నారు. అనంతరరం ఆలయం ఎదుట నిలబడి విజయ చిహ్నం చూపుతూ జై భారత్ అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, గోపీనాథ్, సోము స్వామి, మహేశ్, సతీశ్, తెలుగు మహిళలు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన విద్యుత్తు సేవలు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

రామకుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) పరిధిలో రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా తమ పాలక వర్గం కృషి చేస్తోందని వైస్‌చైర్మన్ విశ్వనాథ్, డైరెక్టర్లు విజయ్‌కుమార్, మనోహర్, సతీష్ తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం ఆనిగానూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, నేతలు రామ్మూర్తి, గురప్ప, గంట్లప్పగౌడు, శ్రీనివాసులురెడ్డి, నరసింహులు, జయప్రకాష్, జయశంకర్, కృష్ణారెడ్డి, సత్తి, కుమార్, బాబురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌చలం, మణీష్, మహేంద్రనాయుడు, భువన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచులోనే దుక్కులు



సోమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమలలో ఉదయం 9 గంటల వరకు దట్టమైన మంచు కురుస్తున్నా తీవ్ర చలిలోనే రైతులు తమ పొలాల్లో ట్రాక్టర్లతో దుక్కులు చేసుకుంటున్నారు. సాయంత్రం 6 గంటలకే మంచు కురుస్తుంది.

విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలి



క్రికెట్ వీక్షణకు డిజిటల్ స్ర్కీన్ ఏర్పాటు చేసిన టీడీపీ నేతలు

పుంగనూరు రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలని పుంగనూరు టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఇండియా-సౌత్ ఆఫ్రికా దేశాల ఉమెన్స్ వరల్డ్‌కప్ తిలకించడానికి డిజిటల్ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. హెచ్ఎం ఇంద్రాణి. టీడీపీ నాయకులు సీవీరెడ్డి, పోలీస్ గిరి, ఐటీడీపీ కుమార్, హరి, సుబ్రహ్మణ్యం, మహేంద్రరాయల్, కృష్ణబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చల్లా రామచంద్రారెడ్డికి

సమస్యలపై వినతులు



చల్లా రామచంద్రారెడ్డికి సమస్యలు తెలుపుతున్న నాయకులు

రొంపిచెర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు, పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వలు సమస్యలపై వినతులు అందించారు. సదుం, సోమల టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తెగిపోయిన వంకలు, చెరువు దుస్థితిపై విన్నవించారు. స్పందించిన ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సోమల సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, మహేంద్రబాబు, టీడీపీ రైతు విభాగం నాయకుడు హరిబాబు, మణియాదవ్, రమేష్‌నాయుడు, బాలునాయుడు, వేణుగోపాల్‌నాయుడు, అమరనాథ్, కోనా గణేష్‌యాదవ్, చాణుక్యరాయల్, ఎం.రఘునాద్, చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ బోడినాయనిపల్లెలో ఈనెల 8న రామాలయ మహాకుంభాభిషేకానికి చల్లా రామచంద్రారెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదరం, శ్రీనివాసులు, మురళి, డీఎం కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయం సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని కడా కార్యాలయ వర్గాలు తెలిపాయి. అర్జీదారులు తమ సమస్యలను వన్నివించుకుంటే సంబంధిత శాఖల అధికారులతో పీడీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

42 మందికి ఉచిత నేత్ర పరీక్షలు



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళి

పలమనేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంలో 42 మందికి చెన్నై శంకర నేత్రాలయ నేత్రవైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నేత్రవైద్యులు మురళి తెలిపారు.

నల్లపువాని గుంటకు గండి

సోమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ మునిరెడ్డిగారిపల్లె సమీపంలోని నల్లపువాగుంటకు ఆదివారం గండి పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కుంటలు, చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. సమీపంలోనే చెన్నపట్నం చెరువు ఉండటంతో దిగువనున్న గుంటలు నీటితో నిండాయి. ఈక్రమంలోనే నల్లపువాని గుంట గండి పడటంతో దిగువనున్న వరి పంట సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులే తాత్కాలిక పనులు చేశారు. సమీపంలోనే పలు బోర్లనుంచి నీరు ఉప్పొంగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బోయకొండలో అన్యమత ఆచారాలపై ఫిర్యాదు



ఈవో ఏకాంబరానికి
వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

చౌడేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో అన్యమత ఆచారాలతో జంతు బలులు చేయరాదని పుంగనూరు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి మాదాస్ లోకేష్, మండల బీజేపీ అధ్యక్షులు కడియాల మనోహర్ ఆలయ ఈవో ఏకాంబరానికి ఆదివారం వినతిపత్రం అందించారు. బోయకొండలో అమ్మవారికి భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం హిందువుల సంప్రదాయమని.. అయితే కొందరు హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా హలాల్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఈవో ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పుంగనూరు బీజేపీ మండలాధ్యక్షులు జగదీష్‌రాజు, నాయకులు గండోడి ప్రవీన్, విశ్వనాథం నాయుడు, నాగరాజ, మల్లిక, రమణ నాయుడు, శేఖర్, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడిగా మురళి



సన్మానం అందుకున్న సర్వేయర్లు

చౌడేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వేయర్ల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడిగా చౌడేపల్లె సర్వేయర్ మురళి ఎంపికయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్వేయర్లు తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో సమస్యలపై పోరాడుతానని తెలిపారు. మురళిని సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, సురేంద్రనాయక్, విజయ్, మోహన్ సన్మానించారు.

కూరగాయల ధరలు పతనం

● వెలవెలబోతున్న రైతు బజార్ ● రూ.26 లక్షల ప్రజాధనం వృథా



పలమనేరు వారపు సంత జరిగే స్థలంలో నిర్మించిన రైతు బజారు



పలమనేరు రైతు బజారు వద్ద నిర్మించిన వాణిజ్యపు గదులు

పలమనేరు, నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యం ఎంత ఉన్నతమైనా పరిస్థితులు అనుకూలించకపోతే ఏ పథకమైనా నీరుగారిపోతుంది అనడానికి పలమనేరు రైతు బజార్ ఉదాహరణ. వినియోగదారులకు చౌకగాను, చిన్న రైతులకు మార్కెట్‌యార్డు కంటే కూరగాయలకు మంచి ధరలు అందించవచ్చన్న లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ రైతు బజార్ ఏర్పాటుకు సంకల్పించింది. దీంతో మున్సిపల్ అధికారులు రైతు బజార్ నిర్మించేందుకు నాలుగేళ్ల కిందట పలమనేరు వారపు సంత జరిగే స్థలంలో కొంత స్థలాన్ని రైతు బజార్ ఏర్పాటుకు కేటాయించారు. దీంతో మార్కెటింగ్ శాఖ రూ. 26 లక్షలతో రైతు బజార్ కోసం ఒక వాణిజ్య సముదాయాన్ని, రైతులు విక్రయాలు చేసుకునేందుకు వీలుగా ఒక షెడ్‌ను నిర్మించింది. నిర్మాణం పూర్తయి ఏడాది గడిచిపోయిన తరువాత ఈ సంవత్సరం మార్చి 9న రైతు బజార్‌ను స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. అయితే ప్రారంభించిన 10 రోజులకే ఈ రైతు బజార్ మూతపడింది. గత ఏడాది కాలంగా రైతులు పండించిన కూరగాయలకు మార్కెట్ లో ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు ఈ రైతు బజార్‌కు వచ్చి కూరగాయలను విక్రయించుకునేందుకు ఆసక్తి చూపలేదు. వారపు సంత జరిగే ప్రాంతంలో ఎవరికి కనిపించని విధంగా నిర్మించడంతో అటువైపు ప్రజలు వెళ్లడం లేదు. వారపు సంత జరిగే స్థలానికి ముందువైపున ఉన్న రోడ్డుపక్కనే కూరగాయల వ్యాపారులు కూరగాయలను విక్రయిస్తుండటంతో ప్రజలు వారివద్దనే కూరగాయలను కొనుగోలు చేసుకొని వెళ్లిపోతుండటంతో రైతులు కొని రోజులు రైతు బజార్‌లో విక్రయాలకు కూరగాయలను తీసుకొచ్చినా అక్కడికి ప్రజలు రాకపోవడంతో వారు నష్టాలతో ఇక రైతు బజారు వైపునకు రావడమే మానేశారు. అధికారులు రైతు బజారు ప్రారంభించిన తొలిరోజుల్లో ఎవరినీ రోడ్డుపక్కన కూరగాయలు విక్రయించకుండా కట్టడి చేసినప్పటికీ ప్రజలు దినసరి కూరగాయలు విక్రయించే వ్యాపారుల వద్దే కూరగాయలను కొనుగోలు చేయడంతో అధికారులు మిన్నకుండి పోయారు. దీంతో ప్రస్తుతం ఈ రైతు బజార్ వృథాగా మారింది. రైతు బజార్‌ను పలమనేరులోని జాతీయ రహదారి పక్కనే నిర్మించినా ప్రయోజనం ఉండేదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

పింఛన్ల పంపిణీలో కుప్పం మున్సిపాలిటీకి ప్రథమ స్థానం



కుప్పం మున్సిపల్ కార్యాలయం

కుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో మొదటి రోజే 97.76 శాతం పంపిణీ పూర్తి చేసి కుప్పం పురపాలక సంఘం జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించింది. పురపాలక సంఘం పరిధిలో నవంబరు నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మొత్తం 5,362 ఉండగా, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందులో 98 శాతం అంటే 5,242 మందికి పంపిణీని ఈనెల 1వ తేదీనే పూర్తి చేసి ఈ ఘనతను సాధించారు. కాగా కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలం 97.45 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ మండలంలో మొత్తం 8,622 పింఛన్లు ఉండగా, మొదటి రోజున 8,402 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కుప్పం మండలం 97.16 శాతం పింఛన్ల పంపిణీతో 5వ స్థానం దక్కించుకుంది. ఈ మండలంలో మొత్తం 9774



మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు

పింఛన్లుండగా మొదటి రోజున 9496 మందికి పింఛన్ల పంపిణీ పూర్త యింది. నగరి మున్సిపాలిటీ, నగరి మండలాలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో వరుసగా 97.4, 97.15 శాతం లక్ష్యం పూర్తి చేసి 3, 4వ స్థానాల్లో నిలిచాయి. కాగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మొదటి స్థానం సాధించడానికి కృషి చేసిన మున్సిపల్ సిబ్బందికి, పూర్తి స్థాయిలోసహాయ సహకారాలు అందించిన మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లకు, ఇతర ప్రజాప్రతినిధులకు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

కుప్పం ప్రజల అభ్యున్నతికి నారా కుటుంబం కృషి

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా ఎంతో నమ్మకంగా తనను గెలిపిస్తూ వస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు కుటుంబం యావత్తు కృషి చేస్తోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం రామకుప్పం మండలం ఆనిగానూరులో జరిగిన పార్టీ బల్ల, ఉన్సిగానిపల్లె, విజలాపురం పంచాయతీలు, కెంచనబల్లలో జరిగిన కెంచనబల్ల, సింగసముద్రం పంచాయతీల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక శాసనసభ్యుడిగా సీఎం చంద్రబాబు గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారన్నారు. మరోవైపు ఆయన సతీమణి నారా భువనేశ్వరి నియోజకవర్గం నుంచి క్యాన్సర్ మహమ్మారిని తరిమేందుకు చర్యలు ప్రారంభించారన్నారు. అలాగే పలు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మరోవైపు మంత్రి నారా లోకేశ్ ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను తీసుకొస్తున్నారని తెలిపారు. చంద్రబాబు సీఎం అయిన 14 నెలలకే కుప్పంకు హంద్రీ-నీవా కాలువ నుంచి కృష్ణాజలాలు వచ్చాయన్నారు. ఏడాదిలోపు నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణాజలాలతో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎయిర్‌పోర్టు, 500 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుతో రానున్న రోజుల్లో కుప్పం నియోజకవర్గానికి రామకుప్పం మండలం తలమానికంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రానారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్ రఫీ, క్లస్టర్ ఇన్‌చార్జి నాగభూషణం కో-ఇన్‌చార్జీలు కామరాజనాయక్, నవీన్ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారపు సంతలో సౌకర్యాల కరువు



చింత చెట్టునీడలోనే సోమల వారపు సంత

సోమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలోని వారపు సంత సౌకర్యాల లేమితో క్రయ విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. 50 ఏళ్ల చరిత్ర గల వారపు సంతకు ఏటా వేలంతో లక్షల ఆదాయం పంచాయతీకి వస్తోంది. చుట్టు పక్కల గ్రామాలు ఎక్కువగా ఉండటంతో ప్రతి శనివారం సంత రోజున రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు అధికంగా వస్తారు. సంతలో షెడ్లు లేకపోవడంతో కూరగాయలు కింద పెట్టుకుని అమ్ముకోవాల్సి వస్తోంది. ఎండావానలకు గుడారాలు వేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రైతుల దాహార్తిని తీర్చేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారు. చౌడేపల్లి- సదుం ప్రధాన రోడ్డు పక్కనే ఉండటంతో సంతలో స్థలం లేక రోడ్డుపైనే కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. నంజంపేట, కందూరు, పెద్దఉప్పరపల్లెల్లో జరిగే వారపు సంతకు సొంత స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని వారపు సంతల్లో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

టీడీపీ నాయకుడికి పితృవియోగం



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దపంజాణి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం పంచాయతీ టీడీపీ నాయకుడు లింగాపురం రమేష్ తండ్రి రామచంద్ర(65) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రుద్రమూర్తి నాయుడు, శంకరప్ప, నాయకులు చలపతి, గంగప్ప, రెడ్డెప్ప తదితరులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు.

శోభాయమానంగా కార్తీక దీపోత్సవాలు

రామకుప్పం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పంట పొలాలపై సీతమ్మ చెరువు నీరు



సదుంలో నీట మునిగిన పంట

సదుం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన ఎడతెరపి లేని వర్షాలతో మండల పరిధిలోని చిన్నపాటి కుంటలు, చెరువులు, సాగునీటి ప్రాజెక్టులు పొంగి పొర్లుతున్నాయి. వీటితోపాటు చాలాకాలం తరువాత సదుం సీతమ్మ చెరువు పూర్తిస్థాయిలో నిండి మొరవపోతోంది. ఈ క్రమంలో స్థానిక ఎర్రాతివారిపల్లె రోడ్డు మార్గంలో గార్గేయ నది నుంచి సదుం సీతమ్మ చెరువుకు నీరు సాగే కాలువలో చెరువు నీరు పొంగి పంటపొలాలపై పారుతోంది. పంట పొలాలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



మొరవ పోతున్న సీతమ్మ చెరువు నీరు

వైభవంగా మహాకుంభాభిషేకం



దళవాయిపల్లెలో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, (ఇన్‌సెట్‌లో) ఆలయ శిఖరంపై ప్రతిష్ఠించిన కలశం

గుడిపాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళవాయిపల్లె గ్రామంలో పునర్నిర్మించిన బసవనారాయణస్వామి ఆలయ మహా కుంభాభిషేకాన్ని అర్చక, పండితులు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం యాగశాల పూజలు, హోమాలు, నందనం, తత్వార్చన, స్పర్శాహుతి, నామకరణం, మహా సంకల్పం, దవ్య హోమం, పూర్ణాహుతి, దీపారాధన, కలశ ఉద్వాసన, గోపురశిఖ మహాసంప్రోక్షణ నిర్వహించారు. 11.45 గంటలకు ప్రధాన విగ్రహాలకు అభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెన్నకేశవులు నాయుడు కుటుంబ సభ్యులు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, దళవాయిపల్లె యూత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యతోనే దేశ, రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల నేతలు, నాయకులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యతోనే దేశ, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఏపీ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక మ్యాంగో భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని, ఈ క్రమంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర హస్త కళలు, చేనేత కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఛైర్మన్ సాయి, తిరుపతి రాయల్, గురజాల చెన్నకేశవులు, చైతన్య, రాందాస్, ఏఎంసీ ఛైర్మన్లు శివరాం, వెంకటేష్, రమణ, అంజలి, దయారాం, తదితరులు ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ రైతులకు పప్పు దినుసుల కిట్లు సిద్ధం



రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన పప్పు దినుసుల కిట్లు

నగరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ రైతులకు పప్పు దినుసుల కిట్లు సిద్ధంగా ఉన్నాయని నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కృష్ణా రామాపురం ప్రకృతి వ్యవసాయ రైతులకు అవసరమయ్యే పప్పు దినుసుల కిట్‌లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు 145 కిట్లు సిద్ధం చేసి అందిస్తున్నామన్నారు. ఈ కిట్‌లో పప్పు దినుసులు మినుము, పెసర, అలసందలు, రాగులు, సజ్జలు, కొర్రలు, మొక్కజొన్న, కూరగాయల విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ తదితర 25 రకాల విత్తనాలతో ఉంటాయన్నారు. సాగుచేసే రైతులకు ఇవి ఉపయోగపడతాయని, అంతర పంటలుగా సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చని, భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు.

చెరువుకట్టలపై ముళ్లకంపలు



పాలసముద్రం పెద్ద చెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

పాలసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పెద్ద చెరువు కట్టపై ముళ్లకంపలు విపరీతంగా పెరిగిపోవడంతో ఆయకట్టు దారులు చెరువు వద్దకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 13 పంచాయతీల్లో సుమారు 35 చెరువులు ఉన్నాయి. గత ఆరేళ్లుగా చెరువు కట్టలపై ఉన్న ముళ్లకంపలను ఇరిగేషన్ అధికారులు తొలగించకపోవడంతో కట్టలన్నీ అడవులను తలపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువుల జోలికే వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చెరువుల గురించి పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారానైనా చెరువు కట్టలపై ఉన్న ముళ్ల కంపలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రహదారే మురుగుకాలువ...!

● కాలువ నిర్మించాలని గ్రామస్తుల వినతి



పెరుమాళకండ్రిగ రహదారిపై పారుతున్న మురుగునీరు

చిత్తూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ గ్రామానికి వెళ్లే రహదారి మురుగుకాలువగా మారింది. ఏళ్ల తరబడి ఈ గ్రామానికి మురుగుకాలువలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుమాళకండ్రిగ, కాలనీ, తాళంబేడు, గువ్వకల్లు తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు కావడంతో నిత్యం వందలాది మంది ఈ మార్గంగుండా ప్రయాణిస్తుంటారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాలువ నిర్మించాలని కోరినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కారణంగా రాత్రుల్లో దుర్వాసనతో పాటు దోమలు అధికమయ్యాయని వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో మురుగు ప్రవహించే ప్రాంతంలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలకు ఆవాసంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగుకాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంగారుపాళ్యం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తుంబకుప్పం గ్రామానికి చెందిన హరిప్రసాద్ కుమారుడు ఉమాశంకర్ (25) శుక్రవారం రాత్రి చిత్తూరు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా తంబుగానిపల్లె క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనం ద్వారా హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఉమాశంకర్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపుల వద్ద ఘర్షణ

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం షాపుల వద్ద తరచూ ఘర్షణలు జరుగుతున్నాయని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఆదివారం మండలంలోని గాండ్లకండ్రిగ మద్యం షాపు వద్ద బీరు బాటిల్‌కి కూలింగ్ లేదని, ధరపై స్టిక్కర్ పెట్టారని, అధిక ధరలకు అమ్ముతున్నారని బీరు సీసా పగలగొట్టడంతో రక్తగాయాలైన సంఘటన చోటుచేసుకుంది. తమిళనాడు ప్రాంతానికి చెందిన రాజేష్, పత్రలు మద్యం కొనుగోలు చేస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. దీనిపై ఎస్‌ఐ మహేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో పన్నూరు సబ్‌స్టేషన్, గాండ్లకండ్రిగ, కనకమ్మసత్రంలో మొత్తం నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించడం లేదని తరచూ గొడవలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని మందు బాబులు కోరుతున్నారు.

బ్యానర్‌ను తగులబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

వెదురుకుప్పం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పెద్దలైన చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, ప్రభుత్వ విప్ థామస్, తన ఫొటోలు ఉన్న బ్యానర్‌ను కొందరు శనివారం రాత్రి చించివేసి తగులబెట్టారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల కార్పొరేషన్ డైరెక్టర్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి యుగంధర్ పొన్న డిమాండ్ చేశారు. ఆదివారం కార్వేటినగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పెనుమూరు మండలం కత్తిరెడ్డిపల్లి పంచాయతీ మాణిక్యరాయనపల్లిలో శనివారం సాయంత్రం జనసేన నేత చంద్రబాబు ఏర్పాటుచేసిన బ్యానరులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్, ప్రభుత్వ విప్ థామస్ సహా తన ఫొటోలు ఉన్నాయని అన్నారు. కొంతమంది గిట్టని వారు బ్యానర్‌ను చించివేసి, రోడ్డుపై కాల్చడం దారుణమన్నారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

10 లోపు పాఠశాలల బస్సులు తనిఖీ చేయించుకోవాలి

నగరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 10వ తేదీ లోపు పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేయించుకుని విద్యార్థులకు భద్రత ఉండే విధంగా మార్చుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి స్కూలు, కాలేజీ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. అందరూ వచ్చి పరీక్షించుకుని సర్టిఫికెట్లు పొందాలన్నారు. సర్టిఫికెట్ లేకుండా బస్సుల్లో విద్యార్థులను తీసుకెళితే వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో పాటు ఆ పాఠశాలల యాజమాన్యంపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇచ్చిన గడువులోపు సర్టిఫికెట్ పొందాలన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



కోటి సంతకాల సేకరణ పోస్టర్ ప్రదర్శిస్తున్న రోజా

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి రోజా మండలంలోని ఇళ్లత్తూరులో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజు బాలాజీ, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం వైసీపీ విభాగం ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు శేఖర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపిరాజు, సుబ్బుయాదవ్, నారపరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్‌ఎస్'

చిత్తూరు అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

నేడు బాలగురునాథీశ్వరాలయంలో కార్తీక వనభోజనం

పాలసముద్రం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీబొమ్మరాజుపురంలో వెలసిన బాలగురునాథీశ్వర ఆలయంలో సోమవారం కార్తీక మాసం వన భోజనాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేసి మహిళలు పిండి దీపాలను వెలిగిస్తారు. ఆలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

దూరదృష్టి కలిగిన నేత చంద్రబాబు

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దూర దృష్టి కలిగిన నేత సీఎం చంద్రబాబు అని టీడీపీ సీనియర్ నేతలు చంద్రమోహన్, వాసురెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మొంథా తుఫాన్‌పై చంద్రబాబు ముందస్తు చర్యలు చేపట్టడం వలన చాలా నష్టాన్ని అదుపు చేశారన్నారు. వరద బాధితులకు తక్షణ సహాయం అందించడం సంతోషదాయకమన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు



పల్లూరు దళితవాడ వద్ద శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంకు

గుడిపాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పల్లూరులోని వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు ఈ ట్యాంకును ఏళ్ల తరబడి శుభ్రం చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ట్యాంకు పైకి ఎక్కడానికి ఉన్న మెట్లు పడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుంతోనని ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా ఈ ట్యాంకు నుంచి వచ్చే నీటిని తాగుతున్నామని తరచూ జ్వరాలు వస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ట్యాంకుకు మరమ్మతులు చేయించి, శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

రోడ్డు దిగాలంటే

వాహన చోదకులకు హడల్



పచ్చికాపల్లం నుంచి ఎర్రమరాజుపల్లె మార్గమధ్యంలో కోసుకుపోయిన రోడ్డు

వెదురుకుప్పం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వాహనం వచ్చిన సందర్భాల్లో వాహన చోదకులు రోడ్డు దిగాలంటే హడలిపోతున్నారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం నుంచి గుట్టమీద ఇండ్లు మీదుగా కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లెకు వెళ్లే రహదారి పక్కన కోసుకుపోయి గుంతలమయంగా మారింది. ఈ క్రమంలో ఎదురుగా వాహనం వచ్చిన సమయంలో బైక్‌ల్లో వెళ్లేవారు, ఇతర వాహనాల వారు రోడ్డు దిగాలంటే భయపడుతున్నారు. రోడ్డు దిగిన సందర్భాల్లో పలువురు ప్రమాదానికి గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి రోడ్డుకు ఇరువైపులా బాగు చేయాలని, పిచ్చి మొక్కలను కూడా తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఛిద్రమైన గ్రామీణ రోడ్లు

● అవస్థలు పడుతున్న గ్రామస్తులు



బురదమయమైన గొల్లమడుగు-కోటూరు దారి



కోటూరు వద్ద గుంతలమయమైన రోడ్డు

గుడిపాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో గ్రామీణ ప్రాంత దారులు పూర్తిగా బురదమయమయ్యాయి. నిత్యం ఈ దారి గుండా విద్యార్థులు, ఉద్యోగులు, పాల బండ్లు, ద్విచక్ర వాహనాలు వెళుతుంటాయి. కోటూరు, గొల్లమడుగు వద్ద దారిలో బురద ఎక్కువగా ఉండటంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. అప్పుడప్పుడు ద్విచక్ర వాహనాలు జారి కింద పడుతున్నాయి. సుమారు కిలోమీటర్ మేర బురద ఉండటంతో ప్రయాణికులు సాహసాలు చేయవలసి వస్తోంది. అధికంగా వర్షం కురిస్తే ఈ గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి దారులు బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఇలాగైతే నూతన భవనం కట్టేదెప్పుడు..?

● సామిరెడ్డికండ్రిగ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం ఎంపికలో తర్జనభర్జనలు

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి స్థలం కోసం నేతలు తర్జనభర్జన పడుతున్నారు. మండలంలో పాతార్కాడు, సామిరెడ్డికండ్రిగ పంచాయతీల్లో పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. పాతార్కాడు పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల ఎంపిక పూర్తయింది. కానీ సామిరెడ్డి కండ్రిగ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేయడంలో నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. సామిరెడ్డి కండ్రిగ పంచాయతీలో పన్నూరు సబ్‌స్టేషన్, గొల్లకండ్రిగ దళితవాడ, గొల్లకండ్రిగ, సామిరెడ్డికండ్రిగ ప్రాంతాలు ఉన్నాయి. అన్ని ఆవాస ప్రాంతాలకు అనుగుణంగా పన్నూరు సబ్‌స్టేషన్ ప్రాంతంలో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టాలని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈవిషయమై అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను గుర్తించి పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి చేయించాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

చెరువు కట్టకు మరమ్మతులు



కళియంబాకం చెరువు కట్టకు మరమ్మతులు చేయిస్తున్న రమేష్

విజయపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళియంబాకంలో చెరువు కట్టకు సాగునీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్ మరమ్మతు పనులు చేపట్టారు. చెరువుకట్ట బలహీనంగా, లీకేజీస్థితిలో ఉండడంతో గుర్తించిన ఆయన ఎక్స్‌కవేటర్ సాయంతో గ్రామస్తులతో కలిసి మరమ్మతు పనులు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్ర్కీన్ వద్ద భారత మహిళల క్రికెట్ జట్టుకు మద్దతు తెలుపుతున్న తెలుగు మహిళలు - డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో ఏర్పాటు చేసిన బిగ్‌స్ర్కీన్ - మలారపల్లెలో సత్యమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మహిళల క్రికెట్ జట్టుకు తెలుగు మహిళల మద్దతు

చిత్తూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రపంచకప్ క్రికెట్ పోటీల ఫైనల్ పోరులో భారత మహిళల జట్టుకు తెలుగు మహిళలు మద్దతుగా నిలిచారు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలోని ప్రజాదర్బార్‌లో ఆదివారం ప్రత్యేక స్ర్కీన్ ఏర్పాటు చేసి మహిళల ప్రపంచ కప్ ఫైనల్ పోటీలను తిలకించారు. భారత్, సౌత్ ఆఫ్రికా మధ్య జరుగుతున్న ఫైనల్ పోరులో భారత మహిళల జట్టు విజయం సాధించాలని స్థానిక వినాయక స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి మొక్కుకున్నారు. తెలుగు మహిళల కేరింతలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు లీలావతి, ఉపాధ్యక్షురాలు దేవి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్‌పర్సన్ అనురాధ, ఎల్ఐసీ అరుణ కుమారి, జమున, ప్రతిభ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

మెసానికల్ మైదానంలో బిగ్‌స్ర్కీన్

చిత్తూరు రూరల్ (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎస్‌ఏ మెసానికల్ మైదానంలో మహిళల ప్రపంచ కప్ లైవ్ మ్యాచ్ వీక్షణకు బిగ్‌స్ర్కీన్ ఏర్పాటు చేశారు. మైదానానికి వచ్చిన క్రీడాకారులు, ప్రజలు బిగ్‌స్ర్కీన్‌లో మ్యాచ్‌ను ఆసక్తిగా చేశారు. స్ర్కీన్ ఏర్పాటుపై డీఎస్‌ఏ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే మరి కొంత మంది వీక్షకులు వచ్చేవారని నగరవాసులు వాపోయారు. గ్రౌండ్‌కు వచ్చే వారు మాత్రం కాసేపు మ్యాచ్‌ను వీక్షించి వెళ్లారు.

కాణిపాకంలో...

ఐరాల(కాణిపాకం) (ఆంధ్రజ్యోతి): భారత్ మహిళల క్రికెట్ జట్టు సౌత్ ఆఫ్రికా జట్టుపై విజయం సాధించాలని కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో మాజీ జడ్పీటీసీ ముల్లగూరి లత ఆధ్వర్యంలో స్వామికి అభిషేకం నిర్వహించారు. అలాగే మల్లారపల్లెలోని సత్యమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ వడ్డపాటి గిరిధర్‌బాబు, సింగిల్‌విండో అధ్యక్షురాలు చిత్రానాయుడు, నియోజకవర్గ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు లగడపాటి కృష్ణకుమారి, క్లస్టర్ ఇన్‌చార్జి దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కొటార్లపల్లి వీధుల్లో నిలిచిన డ్రైనేజీ నీరు

పెనుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలోని పలు రహదారులు, గ్రామాల్లో వీధులు అధ్వానంగా మారాయి. అనేక చోట్ల గోతులు ఏర్పడగా, మురుగు రోడ్లపై నిల్వ ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొటార్లపల్లి, కనికాపురం గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు పరిశీలించి, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బురదమయంగా రోడ్లు



బురదమయంగా ఉన్న ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ రోడ్డు

విజయపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రోడ్లు బురదమయంగా తయారయ్యాయి. ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో రెండు వీధులు, కళియంబాకం మిట్టకండ్రిగలో ఒక వీధి, గాండ్లకండ్రిగ రోడ్డు, వరదరాజులు కండ్రిగ రోడ్డు, శ్రీహరిపురం నుంచి లక్ష్మీవిలాసపురానికి వెళ్లే రోడ్డు, మల్లారెడ్డి కండ్రిగ నుంచి ఎస్టీ కాలనీకొచ్చే రోడ్డుల్లో ఈ పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇక్కడ సిమెంటు, తారు రోడ్లు వేయాలని కోరుతున్నారు.

వర్షాలతో ధ్వంసమైన రహదారులు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు



బాలయ్యకొత్తూరు గ్రామం వద్ద ధ్వంసమైన తారురోడ్డు - తిరువీధికుప్పం నుంచి మహదేవమంగళం గ్రామానికి వెళ్లే తారురోడ్డులో ఏర్పడ్డ గుంతలు - పుత్తూరురోడ్డు నుంచి వెళ్లే దారిలో బొమ్మవారిపల్లె వంకకు సమీపంలో ధ్వంసమైనరోడ్డు

గంగాధరనెల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలకారణంగా పలు రహదారులు ధ్వంసమై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. తూగుండ్రం పంచాయతీ పరిధిలోని పిళ్లారికుప్పం నుంచి దాసరపల్లె బస్టాప్‌కు వరకు, వరత్తూరు నుంచి కుమ్మరపల్లె క్రాస్‌రోడ్ జంక్షన్ వరకు, చిత్తూరు - పుత్తూరు రహదారిలో బొమ్మవారిపల్లె బస్టాప్ నుంచి పాపిరెడ్డిపల్లె వరకు, మేనాటంపల్లె నుంచి కాశేపల్లె దళితవాడ వరకు, కొత్తవెంకటాపురం సచివాలయానికి సమీపం నుంచి ఆదిఆంధ్రవాడ తమిళనాడు సరిహద్దు వరకు, పుత్తూరు మెయిన్‌రోడ్డు జైన్‌ఫ్యాక్టరీ నుంచి ఇ.ఆర్.కండ్రిగ బస్టాప్ వరకు తారురోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారింది. చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణంలో భాగంగా కాశేపల్లెకు సమీపంలో హైవే బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచి బురదమయంగా మారింది. మహదేవమంగళం నుంచి తిరువీధికుప్పం మీదుగా కడపగుంట దళితవాడ వరకు, గంగాధరనెల్లూరు కొయ్యలమిల్లు నుంచి వేపంజేరి వరకు తారురోడ్లు వర్షాలకు ఛిద్రమై కంకరరాళ్లు తేలాయి. ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

బోయకొండలో అన్యమత ఆచారాలపై ఫిర్యాదు

చౌడేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో అన్యమత ఆచారాలతో జంతు బలులు చేయరాదని పుంగనూరు నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి మాదాస్ లోకేష్, మండల బీజేపీ అధ్యక్షులు కడియాల మనోహర్ ఆలయ ఈవో ఏకాంబరానికి ఆదివారం వినతి పత్రం అందించారు. బోయకొండలో అమ్మవారికి భక్తులు జంతుబలులు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం హిందువుల సంప్రదాయమని.. అయితే కొందరు హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా హలాల్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఈవో ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పుంగనూరు బీజేపీ మండలాధ్యక్షులు జగదీష్‌రాజు, నాయకులు గండోడి ప్రవీన్, విశ్వనాథం నాయుడు, నాగరాజు, మల్లిక, రమణ నాయుడు, శేఖర్, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.